క్లుప్తంగా

మునేరుకు భారీగా వరద నీరు



పెనుగంచిప్రోలు: ఎగువన ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో వర్షాలు కురుస్తుండటంతో శనివారం మరోసారి మునేరుకు భారీగా వరద నీరు చేరింది. మునేరుకు వత్సవాయి మండలం పోలంపల్లి ఆనకట్ట వద్ద 10.2 అడుగుల మేర నీరు ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

స్వామిత్వ సర్వే



వెంగనాయకునిపాలెం(పెనుగంచిప్రోలు): మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు స్వామిత్వ సర్వే చేపట్టారు. మండలంలోని వెంగనాయకునిపాలెం, శనగపాడు గ్రామాల్లో డెప్యూటీ ఎంపీడీవో కె.సుబ్బారావు ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శులు, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది శనివారం సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్లు, ఇంటి స్థలాలను మ్యాప్‌ద్వారా కొలిచి యజమానులకు ప్రాపర్టీ కార్డు అందజేయనున్నట్లు వివరించారు. లబ్ధిదారులకు ఏమైనా అనుమానాలు ఉంటే వెంటనే సంప్రదించాలని సూచించారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయి విగ్రహం ఆవిష్కరణ



నందిగామరూరల్: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ దేశానికి ఎనలేని సేవలందించారని బీజేపీ నందిగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తొర్లికొండ సీతారామయ్య కొనియాడారు. మాజీప్రధాని వాజ్‌పేయి వర్ధంతిని పురస్కరించుకుని నందిగామలో శనివారం ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత వాజ్‌పేయికే దక్కుతుందని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు మునగంటి కామేశ్వరరావు, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, పోరుగంటి నరసింహారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యార్డు చైర్మన్‌గా కోగంటి బాధ్యతల స్వీకారం



కంచికచర్ల: కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా కోగంటి వెంకటసత్యనారాయణ(బాబు) శనివారం పదవీప్రమాణ స్వీకారం చేశారు. కోగంటి బాబుతో ఏఎంసీ కార్యదర్శి సబావత్ శ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేయించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఏఎంసీల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు అందజేయడంతోపాటు మార్క్‌ఫెడ్, సీసీఐ ద్వారా రైతులు పండించిన పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం చైర్మన్ కోగంటి బాబును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, నందిగామ, మైలవరం, తిరువూరు ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, వసంత కృష్ణ ప్రసాద్, కొలికపూడి శ్రీనివాసరావు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, నాయకులు కోగంటి రామారావు, ఏచూరి రాము, కోట వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్నకు ఘన నివాళి



చిల్లకల్లు(జగ్గయ్యపేట): సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతిని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయ సిబ్బంది లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యాలయ ఏవో మాధవశర్మ మాట్లాడుతూ గౌతు లచ్చన్న స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. సిబ్బంది కిషోర్, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



పెండ్యాలలో శ్రీకృష్ణుడి విగ్రహం





చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో ప్రత్యేకాకర్షణగా నిలిచిన చిన్నారులు



వాసవీమాత ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



పేట: ప్రత్యేక అలంకరణలో కృష్ణుడు, గోపికల విగ్రహాలు

నందిగామరూరల్: నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ప్రజలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రజలు శ్రీకృష్ణుడి ఆలయాలతోపాటు ఆయా ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణలతో ముస్తాబు చేసి మురిసిపోయారు. చిన్ని కృష్ణులు, గోపికల సందడి అందరినీ ఆకట్టుకుంది.

నందిగామ పట్టణంలో..

స్థానిక సీతారామాంజనేయస్వామి, గీతామందిరం, వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయాలతో పాటు మండలంలోని పల్లగిరి గట్టుపై ఉన్న వేణుగోపాలస్వామి, మాగల్లులోని మదనగోపాలస్వామి ఆలయాలలో స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. స్వామివార్లను భక్తులు, ఆలయాల కమిటీ సభ్యులు దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట: మండల ప్రజలు కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. తిరుమలగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఆలయ చైర్మన్ భరద్వాజ్, ఈవో సాంబశివరావు, అర్చకుడు రామకృష్ణమాచార్యులు పాల్గొన్నారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. అదేవిధంగా రామచంద్రునిపేటలోని శ్రీకృష్ణాలయంలో ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఉట్టికొట్టే కార్యక్రమం సందడిగా సాగింది.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేటఅర్బన్: శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా భక్తులు శనివారం శ్రీకృష్ణుడి ఆలయాలను సందర్శించి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. చిల్లకల్లు రోడ్డులోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకులు శ్రీరంగం శ్రీనివాసాచార్యులు స్వామివార్లకు తులసీమాలలు, నెమలి పింఛాలతో విశేష అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో శ్రీకృష్ణుడు, గోపికల విగ్రహాల అలంకరణ ప్రత్యేకాకర్షణగా నిలిచింది. అదేవిధంగా శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో యాదవ కుటుంబీకులచే ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉట్టికొట్టిన విజేత పరిటాల వీరబాబు అనే యువకునికి శ్రీకృష్ణ శేషమాల, రూ.2,116లను బహుమతిగా అందజేశారు. అర్చకులు శ్రీరంగం శ్రీనివాసచార్యులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల: మండలంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెండ్యాలలో భక్తులు శ్రీ కృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు గోపికలు, శ్రీకృష్ణుడి వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో చిన్నారులు, యువకులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు.

వీరులపాడు మండలంలో..,.

వీరులపాడు: మండలంలోని శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా పెద్దాపురం, అల్లూరు, జుజ్జూరు, జయంతి, గూడెంమాధవరం గ్రామాల్లోని ఆలయాల్లో పూజలు చేశారు. రాత్రి ఉట్టికొట్టే కార్యక్రమాన్ని సందడిగా నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆయా ఆలయాల కమిటీలు, నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.

పెనుగంచిప్రోలు మండలంలో.,.

పెనుగంచిప్రోలు: శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం మండలంలోని పలు ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో కృష్ణాష్టమి సందర్భంగా గోవులకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు బెజవాడ శ్రీనివాసరావు, పాలాది వెంకటరమణ, ఏఈవో జంగం శ్రీనివాసరావు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. అలాగే కృష్ణ మందిరం, శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. కార్యక్రమంలో శ్రీతిరుపతమ్మవారి ఆలయ మాజీ చైర్మన్లు కాకాని శ్రీనివాసరావు, కర్ల వెంకటనారాయణ, వాసిరెడ్డి బెన ర్జీ, వంశపారంపర్య ధర్మకర్త కొమరగిరి రఘురావు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



తిరుమలగిరిలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఈవో సాంబశివరావు



జగ్గయ్యపేట సంతాన వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఉట్టి కొడుతున్న యువకులు



ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకిస్తున్న ప్రజలు



గోపూజ చేస్తున్న శ్రీతిరుపతమ్మ ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, భక్తులు

మోసం చేయడం బాబుకు వెన్నతో పెట్టిన విద్య



నందిగామ16వ వార్డులో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నందిగామటౌన్: ప్రజలను నమ్మించి మోసం చేయడం సీఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ మహ్మద్ మస్తాన్, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కన్నెకంటి జీవరత్నం విమర్శించారు. పట్టణంలోని 10, 11, 16వ వార్డుల్లో శనివారం రాత్రి 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు సీఎం చంద్రబాబు ఇష్టారీతిన హామీలు ఇచ్చి, తీరా అధికారంలోకి వచ్చాక వాటి అమలును పట్టించుకోవడం లేదన్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై రైతులు, విద్యార్థులు, మహిళలతోపాటు అన్ని వర్గాల ప్రజలు తీవ్రఅసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. చంద్రబాబుకు సరైన గుణపాఠం చెప్పే సమయం కోసం రాష్ట్ర ప్రజలు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలను అమలుచేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. సీఎం చంద్రబాబు హామీల పేరుతో చేసిన మోసాన్ని ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని నాయకులు, కార్యకర్తలను కోరారు. అనంతరం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు ఓర్సు లక్ష్మి, పాకాలపాటి కృష్ణ, నాయకులు ఓర్సు జ్వాలా, తోట అంజారావు, వల్లెపు రవి, షేక్ యాకుబ్‌అలీ, పోతురాజు, ఓర్సు కొండ, షేక్ సైదా, షేక్ మున్నా, జ్యోతి, దుర్గ, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాడిపరిశ్రమ అభివృద్ధికి కృషి

నందిగామరూరల్: వ్యవసాయంతోపాటు పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. కృష్ణామిల్క్ యూనియన్, కేడీసీసీ బ్యాంకు సౌజన్యంతో మండలంలోని మునగచర్లలో నిర్మించిన సామూహిక గోకులం షెడ్లను నందిగామ, జగ్గయ్యపేట ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, శ్రీరాం రాజగోపాల్, మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రైతులు సాగుతోపాటు పశుపోషణపై దృష్టి సారించాలని, అందుకు అవసరమైన ప్రోత్సాహాన్ని ప్రభుత్వం అందిస్తున్నారు. అనంతరం పాడి రైతులకు బోనస్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పంగలూరి వెంకటనరసయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ వద్ద ధర్నా



మాట్లాడుతున్న బీఎస్పీ నేత ఆర్‌జే.మల్లికల్

జగ్గయ్యపేటఅర్బన్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీ తరఫున సాధ్యమైనంత ఎక్కువ స్థానాలకు అభ్యర్థులను పోటీ చేయించేందుకు నాయకులు కృషిచేయాలని ఆపార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, జిల్లా పరిశీలకుడు ఆర్‌జే.మల్లికల్ సూచించారు. స్థానిక విద్యానగర్‌లోని బీఎస్పీ కార్యాలయంలో జగ్గయ్యపేట నియోజకవర్గ సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి కొదమల ప్రభుదాసు మాట్లాడుతూ ఈనెల 18వతేదీన బీసీల సమస్యలపై జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.

దళితులపై దాడులకు నిరసనగా సెప్టెంబర్ 24వ తేదీన విజయవాడలో ధర్నా చేయనున్నట్లు వివరించారు. ఈ ధర్నాలను విజయవంతం చేయాలని కోరారు. బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పుష్పరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ.రత్నం, కార్యదర్శి సీహెచ్.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లలోకి వర్షపు నీరు చేరిందంటూ ఆందోళన

జయంతిపురం(జగ్గయ్యపేట):జయంతిపురం నుంచి వేదాద్రికి వెళ్లే రోడ్డులోని కాలనీలో ఇళ్లలోకి వరద నీరు చేరినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటూ శనివారం కాలనీవాసులు ఆందోళన చేశారు. కాలనీలో డ్రైనేజీ వసతి లేకపోవడంతో భారీ వర్షాలకు వరదనీరంతా ఇళ్లలోకి చేరిందని కాలనీవాసులు వాపోయారు. రెండు రోజులుగా వర్షపు నీటిలో ఉంటున్నప్పటికీ కనీసం ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా పట్టించుకోలేదంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు.

గ్రామాన్ని దత్తత తీసుకున్న రామ్‌కో యాజమాన్యం కూడా చిన్నచూపు చూస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌కాలనీలో పర్యటించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. అనంతరంఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్, ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ అధికారులు కలిసి జేసీబీతో వరద నీటిని బయటకు పంపించేందుకు చర్యలు చేపట్టారు

పంటలను ముంచెత్తిన గండివాగు

- వరదలకు గండివాగు ఉగ్రరూపం..
- కొట్టుకుపోయిన కల్వర్టు చప్టా
- నీటమునిగిన పంటపొలాలు
- రైతులకు తీరని నష్టం



నీట మునిగిన వరిచేనును చూపిస్తున్న రైతు



వరదలకు వాగు పొంగడంతో దెబ్బతిన్న పత్తి చేను



వరదకు కొట్టుకుపోయిన సుబాబుల్ తోట

శనగపాడు(పెనుగంచిప్రోలు): అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీవర్షాలకు పెనుగంచిప్రోలు మండలంలోని శనగపాడు వద్ద వాగుపై కల్వర్టు చప్టా కొట్టుకుపోవటంతోపాటు పంట పొలాలు నీటమునిగి రైతులకు తీరనినష్టం వాటిల్లింది. వాగు పక్కన సాగు చేసిన వరి, పత్తి పొలాలతోపాటు గతేడాది సాగు చేసిన సుబాబుల్ తోటలు కూడా దారుణంగా దెబ్బతిన్నాయి. ఒక్కసారిగా వచ్చిన భారీ వరదలకు గండివాగు ఉగ్రరూపం దాల్చడంతో వందెకరాలకు పైగా పంటలన్నీ కొట్టుకుపోయాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ నాట్లు వేయాల్సిందే...

వరదలకు వేసిన వరినాట్లు కొట్టుకుపోవడంతో తిరిగి నాట్లు వేయాల్సిన దుస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.20వేల వరకు పెట్టుబడులు పెట్టామని, భారీ వర్షాల కారణంగా వచ్చిన వరదకు మళ్లీ నాట్లు వేయాలంటే సాగువ్యయం భారీగా పెరిగిపోతోంది. వరదకు పత్తి మొక్కలు కూడా బురదలో కూరుకుపోయి కుళ్లిపోతున్నాయని, మొక్కలు పీకేసి ఏదో ఒక పంట వేయటం తప్ప మరో గత్యంతరం లేకుండాపోయిందని రైతులు వాపోతున్నారు. ఈ వరదల దెబ్బకు కౌలురైతుల పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. ఇప్పటికే కౌలు చెల్లించి సాగు చేపట్టగా, పంటకాలం ఆదిలోనే ఇలా వరదలకు పంట దెబ్బతినడంతో పంటలసాగును కొనసాగించలేని పరిస్థితి ఏర్పడిందని కౌలురైతులు చెబుతున్నారు.

పత్తి చేను మునిగిపోయింది



ఎకరం రూ.14వేలు చొప్పున రెండు ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాను. వాగు పొంగి పొలమంతా వరద పారింది. దీంతో పత్తి మొక్కలు నేటికీ నీటిలోనే నానుతున్నాయి. మొక్కలు పీకేసి మరలా ఏదో ఒక పంట సాగు చేయాలి. ఇప్పటికే రూ.50 వేలు వరకు పెట్టుబడి అయింది. ఏమి చేయాలో అర్థంకావడం లేదు.

– కోరుగుండి నరసింహారావు

వరి చేను కొట్టుకుపోయింది



ఎకరం పొలంలో వరినాట్లు వేయగా వరదకు అంతా కొట్టుకుపోయింది. పొలం మొత్తం నేటికీ వరద నీటిలో ఉంది. ఎకరం 11 బస్తాల చొప్పున కౌలు తీసుకున్నాను. ఇప్పటికే రూ.20 వేలు పెట్టుబడి పెట్టి సాగు చేశారు.వాగు వరదకు పంటచేను కొట్టుకుపోవడంతో తీవ్రంగా నష్టపోయాం.

– పెసరమిల్లి రామారావు


రూ.3లక్షలు నష్టం



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద పొంగి పదెకరాల్లోని పత్తిపంట దెబ్బతింది. ఎకరాకి రూ.30వేలు చొప్పున ఇప్పటివరకు రూ.3లక్షలు ఖర్చయింది.ఈ వరదలకు గ్రామంలో చాలామంది రైతులు నష్టపోయారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– అంగదాల శివ

సుబాబుల్ తోట కోతకు గురైంది



రెండు నెలల కిందట నాలుగు ఎకరాల్లో సుబాబుల్ సాగు చేశాను. రూ.40 వేల వరకు పెట్టుబడి అయింది. వాగు వరదకు పొలం కోతకు గురికావడంతోపాటు మొక్కలన్నీ కొట్టుకుపోయాయి. ఏటా వాగు పొంగుతూ పంటలను ముంచెత్తుండటంతో నష్టపోతున్నాం.

– జెన్నిగొర్ల వెంకటేశ్వరరావు

రోడ్డు మరమ్మతు పనుల్లో నాణ్యత డొల్ల!



గతేడాది సెప్టెంబరులో వచ్చిన వరదలకు దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు(ఫైల్)



మరమ్మతులు చేశాక ఈనెల 12న వచ్చిన వరదలకు ధ్వంసమైన రోడ్డు

జగ్గయ్యపేట: పట్టణంలోని డంపింగ్ యార్డు సమీపంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు ఏడాదికే ధ్వంసమైంది. గతేడాది సెప్టెంబరులో పాలేటికి ఉధృతంగా వరద రావడంతో ఈ ఆర్‌అండ్‌బీ రోడ్డు 300మీటర్ల మేర కొట్టుకుపోయింది. దీంతో మున్సిపల్ అధికారులు లక్షలాది రూపాయలు వెచ్చించి మరమ్మతులు చేపట్టారు. ఈ నేపథ్యంలో మూడురోజుల కిందట కురిసిన భారీవర్షానికి ఈరోడ్డు మరోసారి పూర్తిగా ధ్వంసమైంది. మరమ్మతులు చేపట్టిన ఏడాదికే రోడ్డు ఇలా ధ్వంసం కావడంపై పట్టణ ప్రజలు పెదవివిరుస్తున్నారు. ఈ ఘటన కూటమి పాలనలో ఆయా పనుల నాణ్యతకు అద్దంపడుతోందని విమర్శిస్తున్నారు.

381 మందికి వైద్య పరీక్షలు

జగ్గయ్యపేటఅర్బన్: జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 381మందికి వైద్యపరీక్షలు చేసినట్లు ఫౌండేషన్ కోఆర్డినేటర్ కట్టా నరసింహారావు తెలిపారు. పాఠశాలలో ఆదివారం నిర్వహించే ఈ వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ చైర్మన్, మాజీఎమ్మెల్సీ టీడీ జనార్దన్ కోరారు.